# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఇతర భాషలు నేర్చుకుంటూనే మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**
2. **తెలంగాణలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు ఈరోజు నుంచి క్రీడా పోటీలు జరగనున్నాయి.**
4. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను అనుమతించనున్నట్లు టిటిడి వెల్లడించింది.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ నృత్య గ్రామమైన కూచిపూడిని సమగ్రాభివృద్ధి చేయాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

=========================

భాష అనేది భావ వ్యక్తీకరణ కోసమని, అవసరం కోసం ఎన్ని భాషలైన నేర్చుకోవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శాసనసభ సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయిలో మాట్లాడేందుకు హిందీ దోహదపడుతుందన్నారు. విదేశాలకు వెళ్ళినప్పుడు అంతర్జాతీయంగా ఆంగ్లం ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్ని భాషలు నేర్చు కున్నప్పటికీ, మాతృభాష ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలియజేస్తూ

వాయిస్ .. 30 సెకన్లు

-------------------------

స్వర్ణాంధ్ర విజన్ -2047 సాధనకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా స్వర్ణాంధ్ర డాక్యుమెంట్‌పై నిన్న జరిగిన లఘు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2047 కల్లా రాష్ట్ర తలసరి ఆదాయం మరింత పెరిగేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించామని చెప్పారు. జిల్లాల వారీగా ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తామని, తదనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేశారు.

-------------------------

తెలంగాణలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాదులోని శాసనసభ ప్రాంగణంలో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. రాష్ట్రంలో 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ

వాయిస్ .. 31 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిన్న మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో భూ కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఎస్సీ వర్గీకరణ అంశంపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఆ నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

---

లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన పై తెలంగాణ ప్రభుత్వం నిన్న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాలులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎం ప్రతినిధులు హాజరుకాగా.. బిజెపి, బిఆర్ఎస్ ప్రతినిధులు హాజరుకాలేదు. సమావేశం అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు డీలిమిటేషన్‌పై ఇలాంటి సమావేశాలు ఇంకా కొనసాగుతాయని చెప్పారు. తమిళనాడు నిర్వహించే సమావేశానికి రాష్ట్ర ప్రతినిధుల బృందం వెళ్తుందని అన్ని పార్టీల నుంచి ఒక్కొక్కరు సమావేశానికి వెళ్తారని తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా వాట్సప్ పాలన'పై సభలో ఈరోజు చర్చించనున్నారు. అనంతరం వార్షిక బడ్జెట్‌ను ఆమోదించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వ విద్యాలయాల సవరణ బిల్లు-2025ను మంత్రి నారా లోకేశ్, ఆంధ్రప్రదేశ్ మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల సవరణ బిల్లు-2025ను మంత్రి పి.నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. 2024-25కు సంబంధించి ద్రవ్య వినిమయ అదనపు అంచనాలపై చర్చ, ఓటింగ్ నిర్వహించనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తదుపరి వ్యయం కోసం 58,307 కోట్లరూపాయలను మంజూరు చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించనున్నారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులకు ఈ రోజు నుంచి క్రీడా పోటీలు జరగనున్నాయి. విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానం, డీఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు జ్యోతి వెలిగించి క్రీడాపోటీలు ప్రారంభించనున్నారు. సుమారు 97 మంది ఎమ్మెల్యేలు, 12 మంది ఎమ్మెల్సీలు వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారని

అధికారులు తెలిపారు. కాగా విజేతలకు ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పతకాలు అందించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్–పేపర్ 2, లాజిక్ –పేపర్ 2, బైపీసీ విద్యార్థులకు మేథమెటిక్స్ బ్రిడ్జ్ కోర్సు–పేపర్2 పరీక్షలు జరుగుతాయి.

కాగా.. తెలంగాణాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పేపర్ 2 , ఎకానమిక్స్ పేపర్ –2 పరీక్షలు జరుగుతాయి.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించి తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి వెల్లడించింది..ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా నాయుడు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి సోమ, మంగళవారం దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారాలు మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపింది. బుధవారం, గురువారం 300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు ఏ రోజుకు ఆ రోజే లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేసింది. ఈ నెల 24 వ తేదీ నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు టిటిడి వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్యం కూచిపూడి ఆవిర్భవించిన కూచిపూడి గ్రామాన్ని సమగ్రాభివృద్ధి చేయాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభ సమావేశాల్లో భాగంగా శూన్యగంటలో ఈ అంశంపై నిన్న మాట్లాడారు. 'శాస్త్రీయ నృత్యానికి పేరుపొందిన కూచిపూడి ఇప్పుడు ప్రపంచ సాంస్కృతిక వారసత్వ కేంద్రంగా రూపాంతరం చెందిందన్నారు. ఈ గ్రామంలో అత్యాధునిక కళాప్రదర్శనల కేంద్రంతోపాటు, మ్యూజియం, రికార్డింగ్ స్టూడియోలు ఏర్పాటుచేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూచిపూడిని ప్రపంచ సాంస్కృతిక ఆకర్షణీయ కేంద్రంగా మార్చేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పురందేశ్వరి కోరారు.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్ టెయిన్ మెంట్–వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా–వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో...

=====================